క్లుప్తంగా

వైభవంగా చౌడేశ్వరీదేవి ఉత్సవాలు



జ్యోతులతో ఊరేగింపు చేస్తున్న దృశ్యం

మద్దికెర: మండల కేంద్రంలోని చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే జ్యోతులను వెలిగించి తలమీద ధరించి గ్రామ పురవీధులు గుండా నృత్యాలు చేసుకుంటూ అమ్మవార్ల ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించారు. అనంతరం చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారికి జ్యోతులతో హారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

గడువులోగా విద్యుత్ బిల్లు చెల్లించాలి

ఆలూరు రూరల్: విద్యుత్ వినియోగదారులు ఈనెల 19వ తేదీలోపు బిల్లు చెల్లించాలని ఆలూరు విద్యుత్ ఏఈ లోకేష్ సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు చెల్లించకుంటే కనెక్షన్ కట్ చేస్తామన్నారు. బకాయిలున్న ప్రభుత్వ కార్యాలయాలు కూడా త్వరగా చెల్లించి సహకరించాలన్నారు.

ఎడవలిలో 'ఫ్యామిలీ ఫిజిషియన్'



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి నగేష్

మద్దికెర: పేదలకు సత్వరమే వైద్యసేవలు అందించేందుకు అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో శుక్రవారం చేపట్టారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ వైద్యసేవలు అందించి మందులు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద వైద్యశిబిరం నిర్వహించి అవసరమైన వారికి మందుల అందజేశారు.దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 104 వైద్యులు బెన్‌సజీవ్, హెల్త్‌ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, హెల్త్‌ప్రొవైడర్ దివ్య పాల్గొన్నారు.

పొలం బడితో అధిక దిగుబడి




సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సునీత

ఆలూరు రూరల్: వైఎస్సార్ పొలం బడితో రైతులకు అధిక లాభాలు వస్తాయని ఆలూరు వ్యవసాయ సహాయ సంచాలకురాలు సునీత అన్నారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో ఆర్బీకే వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రా మంలో 30 మంది రైతులను ఎంపిక చేసుకుని పక్కా ప్రణాళికతో పొలం బడి కార్యక్రమం నిర్వహించాలన్నారు. పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, ఎరువులు, పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ-క్రాప్ చేసుకున్న ప్రతి రైతు వారి గ్రామాల్లోని ఆర్బీకేల్లో తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని 5 మండలాల్లో ఈక్రాప్ నమోదు 76 శాతం పూర్తయ్యిందన్నారు. సమావేశంలో ఆలూరు ఏఓ వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

గోనెగండ్ల: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో సచివాలయ ఉద్యోగులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పరిష్కారం కాని సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామ సచివాలయాల్లో అందించే పలు రకాల సేవలను ప్రజలకు చేరవేయాలన్నారు. ముఖ్యంగా సమయ పాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఈఓఆర్డీ నాగేష్ పాల్గొన్నారు.

జరిమానాలు చెల్లించండి



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ తిమ్మారెడ్డి

గోనెగండ్ల: వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన జరిమానాలను వెంటనే చెల్లించాలని ఎస్‌ఐ తిమ్మారెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన పోలీస్ స్టేషన్ రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు లేనివారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులు కావద్దన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి





ఎమ్మిగనూరు జట్టుకు రూ.లక్ష, ట్రోఫీని అందిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి , మొదటి బహుమతి సాధించిన చెట్నెపల్లె జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎర్రకోట

- వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి
- ముగిసిన అంతర్రాష్ట్ర క్రీడలు

ఎమ్మిగనూరుటౌన్: గెలుపోటములను సమానంగా స్వీకరించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం రాత్రి నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ఆర్గనైజర్ విశ్వనాథ్ రమేష్, రామకృష్ణ, ఫుట్‌బాల్ కోచ్ మాబుసాహెబ్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు యూకే రాజశేఖర్, సునీల్‌కుమార్, షబ్బీర్‌అహమ్మద్, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత ఎమ్మిగనూరు

వైఎస్సార్ అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీల్లో ఎమ్మిగనూరు జట్టు విజేత కేతనం ఎగురవేసింది. నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీలు ఐదు రోజుల పాటు ఎంతో ఉత్సాహంగా సాగాయి. చివరిరోజు శుక్రవారం ఉడిపి జట్టుపై ఎమ్మిగనూరు జట్టు విజయం సాధించి రూ.లక్ష నగదుతో పాటు ట్రోఫీని గెలుచుకుంది. ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మహిళా కబడ్డీ పోటీల్లో తమిళనాడు జట్టు విజేతగా నిలిచి రూ.50 వేలు గెలుచుకుంది. వాలీబాల్ పోటీల్లో చెట్నెపల్లె బి.జట్టు ప్రథమ స్థానంలో నిలిచి రూ.40,116 నగదు బహుమతి దక్కించుకుంది. ఇక ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో రెండో స్థానాల్లో నిలిచిన ఉడిపి, హర్యానా, చెట్నెపల్లె ఎ.జట్లు వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.30,116ల నగదు బహుమతులు దక్కించుకున్నాయి.

క్రీడా దుస్తుల అందజేత

స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న వైఎస్‌ఆర్ అంతర్ రాష్ట్ర మహిళా కబడ్డీ క్రీడాకారిణిలకు శుక్రవారం మేఘన స్పోర్ట్ ఆధ్వర్యంలో వీరారెడ్డి, డాక్టర్ మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు క్రీడాదుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుతో సందేశం



పత్తికొండ రూరల్: చూడ ముచ్చట గొలిపే సంక్రాంతి ముగ్గులు వేసేందుకు మహిళలు ఎంతో ఆసక్తి చూపుతారు. భోగి, సంక్రాంతి, కనుమల సందర్భంగా మూడు రోజులు ముగ్గులు వేసేందుకు ముందుగానే రంగవల్లులను సిద్ధం చేసుకుంటారు. పత్తికొండకు చెందిన ఆకుల హరిత శుక్రవారం తన ఇంటి ముంగిట సందేశాత్మక ముగ్గు వేసింది. 'చెట్లను నరకవద్దు- పర్యావరణాన్ని కాపాడుకుందాం', సేవ్-వాటర్, సేవ్ లైఫ్ సందేశాన్ని తెలియజేస్తూ వేసిన ముగ్గులు పలువురిని ఆకట్టుకున్నాయి.

గమ్యం చేరేదెలా!

- కండీషన్ లేని బస్సులతో ప్రయాణికుల ఇబ్బందులు



ఆదోని రోడ్డులో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

హొళగుంద: కాలం చెల్లిన బస్సులు.. ఏ సమయంలో ఎక్కడ ఆగిపోతాయో తెలియని పరిస్థితి. అయినా వాటినే ఆర్టీసీ అధికారులు హొళగుంద మండలానికి తిప్పుతున్నారు. అసలే మండలానికి అరకొరగా తిరిగే బస్సుల్లో పూర్తి కండీషన్ లేని వాటిని నడుపుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. శుక్రవారం ఆదోని నుంచి ముద్దటమాగికి బయలుదేరిన బస్సు గ్రామ శివారులో పంక్చరై ఆగిపోయింది. దీంతో ఆ బస్సుకు వెళ్లాల్సిన గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ గ్రామానికి ఉదయం, సాయంత్రం రెండు సార్లు మాత్రమే బస్సు తిరుగుతుండడంతో చిన్న పిల్లలు, వృద్ధులు, రోగులు నానా అవస్థలు పడుతున్నారు. కండీషన్‌లో ఉన్న బస్సులు నడపాలని, సర్వీసులను పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

15లోగా ఈకేవైసీ చేసుకోవాలి

చిప్పగిరి: ఈనెల 15లోగా పీఎం కిసాన్ లబ్ధిదారులు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ఏఓ ఆనంద్ రైతులకు సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పంటల నమోదు ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలని ఆర్బీకే సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో ఏఈఓ రమాదేవి, ఎంపీఈఓలు రంగస్వామి, ప్రతాప్ పాల్గొన్నారు.

సమగ్ర రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

నందవరం: సమగ్ర రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తోందని తహసీల్దార్ నిత్యానందరాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పూలచింత గ్రామంలో రెవెన్యూ అధికారులు రైతులకు భూ హక్కు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పూలచింత, మిట్టసోమపురం, మాచాపురం, ఇబ్రహీంపురం గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు. రీ సర్వేకు రైతులు సహకారించాలని కోరారు. మండలంలోని కనకవీడు, టి.సోమలగూడురు, నాగలదిన్నె, హాలహర్వి, పెద్దకొత్తిలి, నదికైరవాడి తదితర గ్రామాల్లో రికార్డుల స్వచ్ఛీకరణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో రాఘవేంద్ర, సర్వేయర్ ముగతి శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు



ఫ్లెక్సీని ఏర్పాటు చేయిస్తున్న సెబ్ సీఐ జయరాంనాయుడు

ఎమ్మిగనూరు రూరల్: యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సెబ్ సీఐ జయరాంనాయుడు సూచించారు. శుక్రవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుదాం అనే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ జయరాంనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువత పెడదోవ పట్టకూడదనే ఉద్దేశంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. మత్తు పదార్థాలు వాడుతున్నా, విక్రయించినట్లు తెలిసినా 14500 టో ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ సిద్ధలింగమూర్తి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మద్దికెర: ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ సిద్ధలింగమూర్తి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఉపాధి కార్యాలయం వద్ద 2021-23 సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలో ఆయా గ్రామాల్లో 988 పనులకు గానూ రూ.8.95 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. కొన్ని తప్పిదాల వల్ల రూ.12 వేలు రికవరీ చేశామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ సలీంబాషా, అంబుడ్స్ పర్సన్ మధుసూదన్, ఎంపీపీ డీఎస్ అనితా యాదవ్, జెడ్పీటీసీ దేవిరెడ్డి మురళీధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మహేష్‌రెడ్డి, ఏపీఓ రవీంద్రనాథ్, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, సర్పంచులు బండారు సుహాసిని, విజయుడు పాల్గొన్నారు.

లారీ-కారు ఢీ

- సురక్షితంగా బయటపడిన కారు యజమాని



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

తుగ్గలి: తుగ్గలి- రాతన గ్రామాల మధ్య శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు యజమాని సురక్షితంగా బయటపడ్డాడు. గుత్తి నుంచి ఆదోని వైపు జిప్సం లోడుతో వెళ్తున్న లారీని.. ఆదోని నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న కారు తుగ్గలి-రాతన గ్రామల మధ్య మలుపులో ఢీకొంది. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. ఆదోనికి చెందిన కారు యజమాని రాఘవేంద్ర సీటు బెల్టు పెట్టుకోవడం, కారులో ఎయిర్ బ్యాగులు ఓపెన్ కావడంతో సురక్షితంగా బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న తుగ్గలి ఎస్‌ఐ మల్లికార్జున ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపై ఉన్న కారును పక్కకు తీయించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

భక్తిశ్రద్ధలతో కుంభోత్సవం

హొళగుంద: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో వెలసిన దుర్గమ్మ దేవి మేటి కుంభోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ శివారులో వెలిసిన అమ్మవారికి గురువారం గంగిపూజ నిర్వహించిన గ్రామస్తులు శుక్రవారం తెల్లవారుజామున కుంభాన్ని ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళ్లారు. జలాభిషేకాలు, ఆకుపూజ, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ తదితర పూజలు నిర్వహించారు. పూజల్లో దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

కృష్ణగిరి: దివంగత చెరుకులపాడు నారాయణరెడ్డి జ్ఞాపకార్థం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం జరిగిన పోటీలో బాపనదొడ్డిపై కృష్ణగిరి జూనియర్ జట్టు, చెరుకులపాడుపై వెల్దుర్తి, రామకృష్ణాపురంపై కృష్ణగిరి సీనియర్ జట్లు గెలిపొందినట్లు నిర్వాహకులు మహేష్, శివారెడ్డి, మనోహర్, హరీష్‌రెడ్డి తెలిపారు.

వాహనాల తనిఖీ

హొళగుంద: మండల కేంద్రంతో పాటు ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులో శుక్రవారం ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ వాహనాల తనిఖీ చేపట్టారు. ఆర్‌సీ, ఇతర రికార్డులను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న, సరైన రికార్డులు లేని 20 వాహనాల జయమానులకు రూ.2,025 జరిమానా విధించారు.

స్పందన నిర్వహించాలి

కృష్ణగిరి: ప్రతి రోజు గ్రామ సచివాలయాల్లో సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు తప్పనిసరిగా స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు ఉదయం 10 గంటలకు బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. సాయంత్రం స్పందన నిర్వహించాలని ఈ రెండు విషయాల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

ఎమ్మిగనూరు టౌన్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సంఘం 2023 క్యాలెండర్‌ను శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీసీ సంఘ నాయకులు ఎంఆర్ శ్రీనివాసులు, గడిగె లింగప్ప, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నరసన్న ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు వెంకటేష్, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో పొలం గట్టు విషయంపై గురువారం రాత్రి ఇద్దరు అన్నదమ్ములు ఘర్షణ పడ్డారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మునిస్వామి, రంగస్వామి అన్నదమ్ములు. వీరి మధ్య కొంత కాలంగా పొలం గట్టు విషయమై తగాదా నెలకొంది. గురువారం రాత్రి మునిస్వామి భార్య, కొడుకు, కోడలు కలిసి రంగస్వామి, అతని కుటుంబ సభ్యులు సునిత, గణేష్‌పై కర్రలతో దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా ఆనందం

- పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరుస్తోందని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొసనాపల్లె గ్రామంలో ఆమె గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వారి క్షేమసమాచారాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. గ్రామంలో రహదారులు, మురుగు కాలువల దుస్థితిపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆమె అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వ పాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి దీవించాలని కోరా రు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమ రోజులతో పాటు తమ పాలనలో ప్రతిరోజు సంక్రాంతి ఉందన్నారు. రైతులతో పాటు ప్రజలందరికీ జగనన్న సంక్షేమ పథకాలు ఒకవైపు, మరో వైపు ఆయన అడుగు పుణ్యమా అని వర్షాలు, దిగుబడులతో కరువు లేని కాలంతో ప్రతిరోజు పండుగే అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దాదిపోగు సుంకన్న మాదిగ, ఎంపీడీఓ శ్రీనివాసరావ్, ఈఓఆర్డీ నరసింహులు,ఏఓ అక్బర్‌బాషా, కొసనాపల్లె రామాంజనేయులు,నాగరాజు, బాలచంద్ర, నబిసా, మస్తాన్, అయ్యన్న, రాముడు, లక్ష్మన్న, చెరుకులపాడు మోహన్, పెద్దనాగి, సోములు, శ్రీను, గుజిరి రామకృష్ణ, విద్యుత్ ఏఈ రాఘవేంద్రప్రసాద్, పీఆర్ ఏఈ సురేంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనుల్లో నాణ్యత ఉండాలి



మూసాపనల్లిలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీఆర్ డీఈ శ్రీరాములు

ఆలూరు: సీసీ రోడ్ల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పీఆర్ డీఈ శ్రీరాములు సూచించారు. శుక్రవారం వివిధ గ్రామాల్లో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పీఆర్ సబ్‌డివిజన్ పరిధిలో దాదాపు రూ.3 కోట్లతో పనులను ప్రారంభించామన్నారు. పనుల్లో నాణ్యత లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మరిన్ని సచివాలయాలకు మంజూరైన నిధులతో సర్పంచ్‌లు, ఎంపీటీసీల చేత పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట జేఈ చౌదారెడ్డి ఉన్నారు.



అలనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

కృష్ణగిరి: ఇరవై ఏళ్ల క్రితం వీడ్కోలు చెప్పుకున్న వారందరూ శుక్రవారం కలుసుకున్నారు. మిత్రమా ఎలా ఉన్నావ్.. ఏమి చేస్తున్నావంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ సంతోషంగా గడిపారు. కృష్ణగిరి మండలం కంబాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-03 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్థానిక పాఠశాలలో సమావేశమయ్యారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని నిర్ణయించుకున్నారు. ఏటా పదో తరగతిలో పదికి పది పాయింట్లు సాధించే పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించారు. అనంతరం అతిథులుగా హాజరైన గురువులు వెంకటసుబ్బారెడ్డి, శివశంకరయ్య, యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్, సుబ్బరాయుడు, శ్రీనివాసరెడ్డి, నాగరాజు, రేణుక, చంద్రావతి, వీణా, నాగమంజులు, వార్డెన్ వెంకటరావ్‌లను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు రవికుమార్, రాఘవేంద్రగౌడ్, వీరభాస్కర్, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

కృష్ణగిరి: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేకాట తదితర వాటిపై అన్ని గ్రామాల్లో నిఘా పెంచామన్నారు. అన్ని గ్రామాల్లో పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. గ్రామాల్లో పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే పోలీసులకు సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.



ఉడికిన కందిపప్పును చూపుతున్న ఆర్‌ఐ నాగమణి

కందిపప్పుపై అపోహలొద్దు

వెల్దుర్తి: రేషన్ షాపుల్లో సరఫరా చేసే కంది పప్పు ఉడకడం లేదనే ప్రచారాన్ని నమ్మవద్దని సివిల్ సప్లయి గోడౌన్ ఇన్‌చార్జ్ (ఆర్ఐ) నాగమణి సూచించారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలోని రెండో వార్డుకు వెళ్లి మహిళలకు అవగాహన కల్పించారు. కంది పప్పును మహిళ సమక్షంలోనే స్టవ్‌పై ఉడికించి చూపారు.

మహిళ మృతదేహం లభ్యం



లక్ష్మి మృతదేహం

ఆలూరు రూరల్: ఎల్ఎల్‌సీ కాలువలో గల్లంతైన లక్ష్మి (30) శుక్రవారం విగతజీవిగా మారింది. హాలహర్వి మండలంలోని పచ్చారపల్లి గ్రామం సమీపంలోని ఎల్ఎల్‌సీ కాలువలో లక్ష్మి మృతదేహాన్ని గుర్తించారు. లక్ష్మికి ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామానికి చెందిన వీరభద్రితో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి నలుగురు ఆడపిల్లలు సంతానం. గురువారం కర్ణాటక రాష్ట్రం ఎర్రగుడి సమీపంలోని తన ఇద్దరు కూతుళ్లతో సహా ఎల్ఎల్‌సీ కాలువలో దూకగా ఏడాది పాప శాంతి మృతిచెందగా లక్ష్మి గల్లంతైది. వెన్నెల అనే బాలిక ప్రాణాలతో బయట పడింది.

పకడ్బందీగా భూ సర్వే

- పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్



తుగ్గలిలో మాట్లాడుతున్న ఆర్డీఓ మోహన్‌దాస్

తుగ్గలి: భావి తరాలకు భూ వివాదాల సమస్య ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూహక్కు-భూ రక్ష సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రీ సర్వేపై వీఆర్వోలు, సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ భూ సర్వే వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. భూముల పరిరక్షణ, సివిల్ తగాదాల నివారణ, భూమి అమ్మకాలు, కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించడం, రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనకు, ప్రతి అంగుళం భూమికి క్లియర్ టైటిల్ ఇచ్చేందుకు ఈ సర్వే ద్వారా అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల రైతులకు సమాచారం ఇచ్చి వారి సమక్షంలోనే రీ సర్వేను పారదర్శకంగా చేయాలన్నారు. సాగుకు యోగ్యమైన ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో త్వరితగతిన గుర్తించాలన్నారు. అనంతరం పక్కా గృహాల నిర్మాణాలపై హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉగాదికంతా లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసేలా నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రవి, హౌసింగ్ డీఈ గురుప్రసాద్, ఏఈ విజయకుమార్, డీటీ నిజాముద్దీన్, రీసర్వే డీటీ మధుమతి, ఆర్‌ఐ సుధాకర రెడ్డి, మండల సర్వేయర్ గాదిలింగప్ప పాల్గొన్నారు